నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ అశోక్‌నగర్ ఫీడర్ పరిధిలో నేడు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ ధరణి ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 పీఅండ్‌టీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం10.00 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ ప్రతాప్‌సింగారం ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ నారాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తాత్కాలిక మరమ్మతులతో పరిష్కారం



ఉప్పల్: ఎమ్మెల్యే చొరవతో వరంగల్ ప్రధాన రహదారిపై వాహనాలు సాఫీగా వెళ్తున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ట్రాఫిక్ అధికారులతో కలిసి గుంతల మయమైన జాతీయ రహదారిని ఎమ్మెల్యే పరిశీలించిన విషయం తెలిసిందే. రహదారిపై ఏర్పడిన గుంతల్లో మట్టిని నింపే కార్యక్రమం మంగళవారం వరకు కొనసాగింది. ట్రాఫిక్ పోలీసులు సైతం చొరవ తీసుకుని తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అధ్వాన్నంగా మారిన రహదారి అద్దంలా మారడంతో వాహనాలు సాఫీగా వెళ్లాయి.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తానని..

- డబ్బులు కాజేసిన వ్యక్తి రిమాండ్
- సుమారు రూ.1.50 కోట్ల టోకరా



వెలిశెట్టి నాగరాజు

మేడిపల్లి: డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పలువురి పేదలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అమృతకాలనీలో నివాసం ఉంటున్న నాగరాజు(45)తాను డబుల్‌బెడ్రూం కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని చెప్పాడు. పలువురు రాజకీయ నాయకులు తెలుసునని సుమారు 100 మందికి పైగా ఇళ్లులేని పేదలకు ప్రతాప్ సింగారంలో నిర్మించిన డబుల్‌బెడ్రూంలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున సుమారు రూ.1.50 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసి ఇళ్లు ఇప్పించకపోగా.. మాయ మాటలతో కాలయాపన చేస్తూ.. తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో బాధితులు మోసపోయామని గ్రహించి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'టీఎల్ఎం' మేళా

అల్వాల్: అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో టీఎంఎల్ఎం మేళా నిర్వహించారు. మంగళవాకం జరిగిన కార్యక్రమానికి మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి హాజరై ఉపాధ్యాయులు తయారుచేసిన టీఎల్ఎంలను పరిశీలించి అభినందించారు. ఈ టీఎల్ఎంలను ఉపయోగించడం ద్వారా విద్యార్థి అవగాహన స్థాయి పెరుగుతుందని వివరించారు. హెడ్‌మాస్టర్ సునీల, బాలుర పాఠశాల హెచ్ఎం రమాదేవి, లక్ష్మి, రమాదేవి, లక్ష్మణ్, కైలాసపతి, శిరీష, మండల ఆర్‌పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ చదువరులతోనే సాధ్యం

ఉప్పల్: ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ చదువరులతోనే సాధ్యమవుతుందని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎండీ. రియాజ్ అన్నారు. విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం, సాంస్కృతిక వారసత్వం పరిరక్షణ, సామాజిక సేవాభావం పెంపొందుతాయన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ తెలుగు, గ్రంథాలయ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. డిజిటలీకరణ, కృత్రిమమేథకి పెద్దపీట వేసే గ్రంథాలయాలు నేడు అత్యవసరమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, వాటిని భవిష్యత్తుకు దిక్సూచిగా వాడుకోవాలని సూచించారు. డా. తిరుపతయ్య, విశ్వనాథ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



స్థానికులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్ వేణుగోపాల్‌నగర్ కాలనీ పార్కులో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ముఖ్యధ్యేయమన్నారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజలు ఉత్సాహంగా ఉండేందుకు కాలనీలో పార్కులు, జిమ్ పరికరాల వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి కాలనీలో ఇలాంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఏఈ వరుణ్‌దేవ్, కాలనీవాసులు హిమాన్షుశేఖర్, గోపాల్, ప్రభ, సరితారెడ్డి, బీఆర్ఎస్ నేతలు నరేందర్‌రెడ్డి, రాముయాదవ్, శరణగిరి, యాదగిరిగౌడ్, హేమంత్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, జావేద్, అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా అధికారులతో కలిసి పర్యటన..

అల్వాల్: వెంకటాపురం డివిజన్ మానస సరోవర్ అపార్ట్‌మెంట్స్, కమలాలయ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ అవుట్‌లెట్ల ఏర్పాటు, స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మాణ పనుల గురించి ఎమ్మెల్యేకు కాలనీవాసులు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎం సాంబయ్య, మేనేజర్ రమేష్, డీఈ ప్రశాంతి, ఏఈ ఝాన్సీ, హైడ్రా అధికారులు చంద్రశేఖర్, మునిరత్నం, కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్‌గౌడ్, అపార్ట్‌మెంట్‌వాసులు మనీష్, యుగంధర్, కమలాలయ కాలనీవాసులు వినోద్, అశోక్, రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాల్‌నగర్ కాలనీలో జిమ్ పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి

అంగన్‌వాడీలో వసతుల కల్పనకు కృషి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డీసీ జకియా సుల్తానా

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ దొడ్లబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో వసతులు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్కిల్ డీసీ జకియా సుల్తానా ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్రంలో తాగునీటి వసతి, కేంద్రానికి మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణం, పవర్‌బోర్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. చిన్న పిల్లలు వచ్చే అంగన్‌వాడీ కేంద్రంలో ఇతర ఇబ్బందులున్నా.. పరిష్కరిస్తామన్నారు. ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, పీఓ మల్లికార్జున్, ఏఈ దివ్యజ్యోతి, మేనేజర్ నవీన్, వీఐ రజనీకాంత్, నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

మేడిపల్లి: ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో కార్యాలయం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై శ్వేతాఅరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం రాకముందే దేశంలోనే తొలి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, ఆజాద్ లాంటి ఎందరో వీరుల ఆశయసాధనకు బబ్రుద్దిన్ బాసు, ప్రేమ్‌నారాయణ భార్గవ్‌ల నాయకత్వంలో 1936 ఆగస్టు12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందన్నారు. పలు విద్య, రైతుల సమస్యలపై సమరశీల పోరాటాలను విజయవంతం చేసిందని వివరించారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, మహేష్, శివసాయి, ఆదిత్య, అరవింద్ చిన్న, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ వేలాన్ని నిలిపేయాలి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ప్రజల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను హౌజింగ్ సొసైటీ అధికారులు వేలం వేసి విక్రయించేందుకు సిద్ధమయ్యారని, దీనిని నిలిపేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. కాలనీ ఏర్పడిన సమయంలోనే కాలనీ అవసరాలకు నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను విక్రయించడం ఆక్షేపనీయమని, దీనిపై తగిన చర్యలు తీసుకుని కమ్యూనిటీహాల్‌ను పరిరక్షించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. లేదంటే కమ్యూనిటీహాల్‌ను జీహెచ్ఎంసీకి అప్పగించేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు వెంకటాచారి పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

మౌలాలి: అర్బన్ హెల్త్‌సెంటర్ ఆస్పత్రికి కొత్తగా వచ్చిన డాక్టర్ ప్రత్యూషకు బీఆర్ఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆస్పత్రికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలు వంశీముదిరాజ్, మహ్మద్ ఉస్మాన్, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మారుతీప్రసాద్, మదన్, అజయ్, జియా తదితరులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు.

బీజేపీ కార్పొరేటర్ల హౌస్ అరెస్ట్



కార్పొరేటర్ శ్రీవాణి



గృహ నిర్బంధంలో కార్పొరేటర్ సునీత



ఆర్‌కేనగర్‌లో పోలీసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

రామంతాపూర్ : బంజారాహిల్స్‌లో ఇటీవల కూలివేసిన పెద్దమ్మ గుడిలో మంగళవారం హిందూ సంఘాలు నిర్వహిస్తున్న కుంకుమార్చనకు హాజరు కాకుండా రామంతాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బండారు శ్రీవాణిని ఉప్పల్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆమె మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు.

మౌలాలి: పెద్దమ్మగుడిలో కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్లేందుకు బయలుదేరిన మౌలాలి కార్పొరేటర్ సునీతను నేరేడ్‌మెట్ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పెద్దమ్మ ఆలయాన్ని కాపాడుకునేందుకు హిందూ సమాజం పెద్ద యుద్ధాన్ని చేసి విజయం సాధించగా.. ఇప్పుడు పూజలు చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందని ధ్వజమెత్తారు.

మల్కాజిగిరి: డివిజన్ బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్‌ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అమ్మవారి ఆలయం కూల్చివేతకు నిరసనగా మంగళవారం అక్కడ జరిగే సామూహిక కుంకుమార్చనకు వెళ్లకుండా తెల్లవారుజామునే పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నిజాం పాలనను గుర్తు చేస్తోందని ఆరోపించారు.

అల్వాల్: పెద్దమ్మతల్లి ఆలయం కూల్చివేతకు నిరసనగా బీజేపీ నేతలు చేపట్టిన సామూహిక పూజ కార్యక్రమాలకు ముందస్తుగా మచ్చబొల్లారంలోని బీజేపీ నాయకులను మంగళవారం అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కాప్రా: నిరుద్యోగ యువతకు క్యాడర్ టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందిస్తుందని సంస్థ ప్రతినిధి నాగరాజు తెలిపారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ కోర్సుల్లో 4 నెలల పాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణ అనంతరం పలు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పించనున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 27 ఏళ్ల లోపున్న యువతీయువకులు ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ నిర్వాహకులు సూచించారు. ఆసక్తి కలిగిన వారు ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్ సమీపంలోని టెక్ మహీంద్ర ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9100056583.

అంజన్నకు సింధూర పూజ

రామంతాపూర్ : ఇందిరానగర్‌లోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పూర్వ భద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి సింధూర పూజ, అభిషేకం, ఆకుపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయల ప్రధాన అర్చకులు శేషాచార్యులు మాట్లాడుతూ.. ఆంజనేయస్వామిని మంగళవారం శనివారం ఆరాధించి హనుమాన్‌చాలీసా పఠిస్తే దృష్టశక్తులు దూరమై అన్ని శుభాలే కలుగుతాయన్నారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి, ఈఓ విజయభారతి, అర్చకులు తిరుపతాచార్య, సీతారామాచార్య, శంకర్ తదితరులున్నారు.

మండప నిర్వాహకులతో సమావేశం



అల్వాల్: అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాయక మండప నిర్వాహకులతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నివారణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అల్వాల్ పోలీసులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్



ఉప్పల్: ఉప్పల్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయనకు సైబరాబాద్, రాచకొండ కమిషనర్ల పోలీసింగ్‌పై సంపూర్ణ అవగాహన ఉంది. గతంలో బాలానగర్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా పనిచేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: చిలుకానగర్ రాఘవేంద్రనగర్‌లో రూ.17 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ మంగళవారం జీహెచ్ఎంసీ ఏఈతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఎల్ఓసీ అందజేత



మల్లాపూర్: భవానీనగర్ కాలనీకి చెందిన శ్రీలత అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైనా వైద్య చికిత్స కోసం మంజూరైనా రూ. 2,20,000 ఎల్ఓసీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

రాఘవేంద్రస్వామి బోధనలు ఆచరణీయం



ప్రత్యేక పూజల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



పురవీధుల్లో రథోత్సవము

రామంతాపూర్ : గణేష్‌నగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో స్వామివారి 354 ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాఘవేంద్రస్వామి హిందూ ధర్మానికి గొప్ప గురువు అని, ఆయన భక్తులు ప్రహ్లాదుని మరో అవతారంగా భావిస్తారన్నారు. స్వామివారి బోధనలు మానవాళికి ఆచరణీయమని కొనియాడారు.

◆ స్వామివారిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డితో పాటు కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ ప్రకాష్ ఆచార్, బండి వినయ్, శ్రీనివాస్ దేశాయ్, విఠల్, కులకర్ణి కేశవ్, కాంగ్రెస్ నేతలు ఆగిరెడ్డి, అరుణ్‌పటేల్, ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా ఉత్తరారాధన, రథోత్సవం..

మల్కాజిగిరి: వేంకటేశ్వరనగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో స్వామివారి 354వ ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్తరారాధన, మహారథోత్సవం ఘనంగా జరిగింది. నేడు సుజ్ఞానేంద్రుల ఆరాధనతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయని మఠం నిర్వాహకులు ప్రకటించారు.

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని సరస్వతీకాలనీలో రూ.20 లక్షలతో పార్కు అభివృద్ధి పనులకు మంగళవారం నాచారం కార్పొరేటర్ శాంతితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డీఈ బాలకృష్ణ, ఏఈ వినీత్, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేత సాయిజెనోశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి



మల్లాపూర్: ఎస్వీనగర్ ఫేజ్ కాలనీలో గత కొద్ది నెలలుగా తాగునీటి సరఫరాలో డ్రైనేజీ నీరు కలుషితమై సరఫరా అవుతున్నాయని, నీరు కాస్త దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో చిన్న పిల్లలు, వృద్ధులు విరేచనాలు, విషజ్వరాలతో బాధపడుతున్నారు. పలుమార్లు జలమండలి మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు కలుషిత నీరు ఎక్కడ కలుస్తుందో గుర్తించలేకపోతున్నారు. అసలే వర్షాకాలం కలుషిత నీరు కలవకుండా వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి



మల్కాజిగిరి తిరంగా ర్యాలీలో డీసీ జకియా సుల్తానా

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని బోడుప్పల్ బీజేపీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడు ఏర్పుల మహేష్ అన్నారు. చెంగిచర్లలో హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మెయిన్‌రోడ్డు నుంచి ఎంఎల్ఆర్ కాలనీ వరకు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఆయనతో పాటు ఘర్ ఘర్ తిరంగా కన్వీనర్ రాజిరెడ్డితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి విక్రంరెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, లక్ష్మయ్య, శంకర్, విజయలక్ష్మి, పద్మారెడ్డి, నర్సింగ్‌రావు, సంధ్యారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

కుషాయిగూడ: కాప్రా సర్కిల్ అధికారులు చర్లపల్లి డివిజన్‌లో హర్‌ఘర్ తిరంగా హర్‌ఘర్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. శివసాయినగర్ కాలనీ, డీమార్ట్ పక్కన చెత్త, చెదారంతో నిండి ఉండే ప్రాంతాన్ని ఎంచుకుని శుభ్రం చేశారు. కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎల్‌బీనగర్ జోనల్ డీసీ ఎస్‌డబ్ల్యూఎం గోపాల్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ మధుసూదన్‌రావు మొక్కలు నాటారు. జీహెచ్ఎంసీ ప్రోగ్రామ్ కో‌‌– ఆర్డినేటర్ యశశ్రీ, మేధాజ్యోతి, సుదర్శన్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ శానిటేషన్ విభాగం, స్కూల్ విద్యార్థులతో కలిసి మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. డీసీ జకియా సుల్తానా జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మిషన్ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహించామన్నారు. ఏఎమ్‌హెచ్ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ చింత శ్రీనివాస్, యశస్వినిరెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కులు సాధించిన నాయకుడు కేఎల్ మహేంద్ర

కాప్రా: దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థల్లో లేని విధంగా సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా హక్కును సాధించిన గొప్ప నాయకుడు కేఎల్. మహేంద్ర అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు కేఎల్.మహేంద్ర 18వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కమలానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మహేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో మహేంద్ర పాల్గొన్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉక్కు, సిమెంట్, బొగ్గుగని కార్మికుల సమ్మెకు నాయకత్వం వహించారని తెలిపారు. 2001లో సింగరేణి బొగ్గుగని కార్మికుల సమ్మె కొనసాగుతున్న సమయంలో నాటి సీఎంగా చంద్రబాబు సమ్మె చేస్తే.. ఒకరోజు సమ్మెకు 3 రోజుల వేతనం కోత విధిస్తామని కార్మికుల హక్కులను అణిచివేసే ధోరణితో వ్యవహరిస్తే సింగరేణిలో లాభాల వాటాలో 10 శాతం వాటా ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడంలో మహేంద్ర కృషి మాటల్లో చెప్పలేమని కొనియాడారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, నాయకులు సతీష్‌కుమార్, మహేష్, అజీమ్‌పాషా, సలీం, సమీర్, సాయిలు తదితరులున్నారు.